సాక్షి
కర్నూలు
గురువారం, 22, జూన్, 2023



జనారణ్యంలోకి జాతీయ పక్షి

తుగ్గలి: జాతీయ పక్షి నెమలి జనారణ్యంలో సంచరిస్తోంది. కొన్నాళ్లుగా తుగ్గలిలో స్వేచ్ఛగా తిరుగుతోంది. బుధవారం ప్రధాన రహదారి పక్కన మేత కోసం పరుగుపెడుతూ కనిపించింది.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఒంగోలుకు చెందిన డి.శ్రీనివాసరావు దంపతులు బుధవారం రూ.1,01,116 విరాళం అందించారు.

జ్వాలా వీరభద్రుడికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం జ్వాలావీరభద్రస్వామికి, సాక్షిగణపతికి అభిషేకం, విశేషపుష్పార్చన నిర్వహించారు.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు స్వల్పంగా ఇన్‌ఫ్లో

- ఎగువ ప్రాంతాల్లో కురవని వర్షాలు



నీటి మట్టం తక్కువగా ఉన్న టీబీ డ్యాం

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో స్వల్పంగా ఉంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవకపోవడంతో నీటి చేరిక ఆశాజనకంగా లేదు. గతేడాది రిజర్వాయర్‌లో ఇదే సమయానికి 1612.81 అడుగుల వద్ద 43.635 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఇన్‌ఫ్లో 2,837 క్యూసెక్కులుంటే ఔట్‌ఫ్లో 299 క్యూసెక్కులుగా ఉండేది. ప్రస్తుతం డ్యాంలో 4.242 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. 367 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉంటే 1,577 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. నైరుతి రుతు పవనాలు రావడానికి ఆలస్యం కావడంతో ఈ ఏడాది డ్యాంకు వరద మొదలు కాలేదు. ఆగస్టు 15 వరకు వర్షాలు కురిసే అవకాశాలుండడంతో త్వరలో ఇన్‌ఫ్లో పెరిగి డ్యాంకు నీటి కళ రావొచ్చని టీబీ బోర్డు అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దాసుపత్రికి రూ.2.72 కోట్లు మంజూరు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,72,55,769 మంజూరు చేసింది. దీంతో పాటు ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాలకు రూ.2,35,000 విడుదలయ్యాయి. ఈ నిధులతో ఆసుపత్రిలో పెండింగ్ బిల్స్ క్లియరెన్స్, మైనర్ రిపేర్లు, ఎలక్ట్రికల్ పనులు, మంచాలు, పరుపుల కొనుగోలు, తాగునీటి అవసరాలు, ఇతరత్రాలకు ఖర్చు చేయనున్నారు.

నూతన విద్యావిధానంపై 23న అవగాహన సదస్సు

కర్నూలు (న్యూసిటీ): నూతన విద్యావిధానంలో భాగంగా యూజీ కోర్సులపై ఈనెల 23న అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లోని సెనేట్ హాలులో అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌యూ, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు హాజరు కావాలన్నారు.

నేడు కర్నూలుకు భారత టెలికాం మంత్రి రాక

కర్నూలు(సెంట్రల్): భారత టెలికాంమంత్రి దేవాన్స్ చౌహాన్స్ కర్నూలు రానున్నారు. ఆయన 22, 23, 24 తేదీల్లో కర్నూలు జిల్లాలో పర్యటించి స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. 22వ తేదీ ఉదయం హిందూపురం నుంచి కర్నూలు చేరుకుంటారు. 24న ఉదయం రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు వెళ్తారు.

రాహుకేతులకు మండలాభిషేకం

మహానంది: క్షేత్రంలో నూతనంగా రాహుకేతు విగ్రహాలు ప్రతిష్ఠించి నలభై రోజులు పూర్తయిన సందర్భంగా బుధవారం మండలాభిషేక పూజలు నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, పండిత బృందం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, రాహుకేత విగ్రహాలకు ద్రవ్యాభిషేకం, పంచామృతాభిషేకం, వరుణ కలశాభిషేకం నిర్వహించారు. రాహుకేతు మూలమంత్ర హోమం, దీక్షా హోమం, పూర్ణాహుతి పూజలు చేశారు.

కరుణ చూపుతూ.. కన్నీళ్లు తుడుస్తూ!

- వైఎస్సార్ బీమా పథకంతో పేదలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- సహజ మరణానికి రూ.లక్ష, ప్రమాద మరణానికి రూ.5 లక్షల పరిహారం
- 2023–24 సంవత్సరానికి ముగింపు దశకు చేరిన నమోదు ప్రక్రియ
- బీమా నమోదులో రాష్ట్రంలో కర్నూలు జిల్లా రెండో స్థానం
- రైస్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం లబ్ధిదారే
- కొత్తగా 2,8917 కుటుంబాలకు బీమా సదుపాయం



వైఎస్‌ఆర్ బీమా నమోదు దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఊహించని విపత్తులు.. అనుకోని ప్రమాదాలు.. హఠార్మణాలు పేద కుటుంబాలను శోకసంద్రంలోకి నెడుతున్నాయి. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తిని కోల్పోయి ఆయా కుటుంబాల్లో నైర్యాశ్యం నెలకొంటోంది. అప్పటి వరకు సాఫీగా సాగిన జీవితం తల్లకిందులవుతోంది. ఆర్థిక ఇబ్బందులతో పిల్లల చదువులు సైతం ఆగిపోతున్నాయి. పేదల కష్టాలను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తూ వారికి అండగా నిలుస్తోంది. ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక చేయూత అందిస్తూ ధీమా నింపుతోంది.

రూపాయి కూడా ప్రీమియం లేకుండా..

రైస్ కార్డు కలిగిన ప్రతి కుటుంబంలో ఒకరికి (ఇంటి యజమానికి) రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తోంది. బీమా ఉన్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, ప్రమాదంలో రెండు కళ్లు లేదంటే రెండు చేతులు పోతే రూ.5 లక్షలు, ఒక కాలు, ఒక చేయిపోతే రూ.2.50 లక్షలు, సాధారణంగా మరణిస్తే రూ.లక్ష ప్రకారం పరిహారం లభిస్తుంది. 18 నుంచి 70 ఏళ్లలోపు వారికి ప్రమాద బీమా, 18 నుంచి 50 ఏళ్లలోపు వారికి సహజ మరణం బీమా వర్తిస్తుంది. ఆధార్ కార్డులోని పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకొని క్లైమ్‌లను పరిష్కరిస్తారు. సహజ మరణానికి పరిహారం పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రమాదవశాత్తు జరిగే మరణాలకు పరిహారం చెల్లింపునకు ప్రభుత్వం బీమా కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. అసంఘటిత రంగంలోని రైస్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఒక్క రూపాయి కూడా ప్రీమియం లేకుండా వైఎస్సార్ బీమా సదుపాయం కల్పించడం విశేషం. సహజ మరణం పొందినా, ప్రమాదశాత్తు మరణించినా వెంటనే సంబంధిత సచివాలంలోని వెల్ఫేర్ అసిస్టెంటుకు సమాచారం ఇస్తే 24 గంటల్లోపు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు చెల్లిస్తారు.

గడువులోపు పరిహారం..

వైఎస్సార్ బీమా కింద క్లైమ్‌ల పరిష్కారానికి ప్రత్యేక షెడ్యూలు ఉంది. దీని ప్రకారం సహజ మరణం క్లైమ్‌లను 24 రోజులు, ప్రమాద మరణం క్లైమ్‌లను 65 రోజుల్లోను పరిష్కరిస్తున్నారు. సచివాలయం స్థాయిలో జరిగే డాక్యుమెంటేషన్‌ను అనుసరించి క్లైమ్‌లు పరిష్కారం అవుతాయి. సహజ మరణం లేదంటే ప్రమాద మరణాలకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు డాక్యుమెంటేషన్ పూర్తి చేసి కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ– వైకేపీలోని వైస్‌ఆర్ బీమా కాల్ సెంటర్‌కు పంపాల్సి ఉంది. కాల్ సెంటరులో బీమా డీపీఎం, డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్‌లు పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే ఆమోదించి పరిహారం చెల్లింపు కోసం జీఎస్‌డబ్ల్యూస్ డిపార్టుమెంటుకు పంపుతారు. సహజ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రమాద మరణాలకు ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ పరిహారం చెల్లిస్తుంది.

5.6 లక్షల కుటుంబాలకు బీమా

రూపాయి ఖర్చు లేకుండా పేదలకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా సౌకర్యం కల్పిస్తోంది. ప్రతి ఏటా బీమాను రెన్యువల్ చేసుకునే అవకాశం ఇస్తోంది. 2023–24లో రెన్యువల్‌తో పాటు కొత్త కుటుంబాలకు బీమా సదుపాయం, అలాగే మార్పులు చేర్పులకు కూడా అవకాశం లభించింది. ఈ నెల 1నుంచి గ్రామ, వార్డు వలంటరీలు రెన్యువల్ చేయడంతో పాటు కొత్త కుటుంబాలను వైఎస్‌ఆర్ బీమా పరిధిలోకి తేవడానికి సర్వే చేస్తున్నారు. ఈ సర్వే 11 దశల్లో జరిగింది. కర్నూలు జిల్లాలో 6,62,654 రైస్‌కార్డులు ఉండగా వైఎస్సార్ బీమా పొందడానికి 6,23,612 కటుంబాలకు అర్హత ఉన్నట్లు తేలింది. ఇందులో 5,69,866 కుటుంబాలకు వైఎస్‌ఆర్ బీమా సదుపాయం లభించింది. ఈ ఏడాది కొత్తగా 28,917 కుటుంబాలకు వైఎస్సార్ బీమా సదుపాయం లభించింది.

జిల్లాకు రాష్ట్రంలోనే రెండో స్థానం

రెన్యువల్ చేయడంలోను, న్యూ ఎన్‌రోల్‌మెంటులోను కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. 2022–23లో 5,49,528 కుటుంబాలకు బీమా సదుపాయం కల్పించారు. ఇందులో 5,40,949 కుటుంబాలకు బీమా సదుపాయాన్ని రెన్యువల్ చేశారు. ఇంకా 8,579 కుటుంబాలు వైఎస్‌ఆర్ బీమాను రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంది. బయోమెట్రిక్, ముఖ గుర్తింపు, ఓటీపీ ద్వారా రెన్యువల్ చేసుకోవచ్చు. రైస్ కార్డు లేకపోయినప్పటికీ బీమా పొందవచ్చు. కొన్ని కుటుంబాలకు చెందిన వారు రైస్ కార్డుకు దరఖాస్తు చేసుకొని ఉండవచ్చు. అలాంటి వారిని వార్డు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు బీపీఎల్(బిలో పావర్టీ లైన్) ఫ్యామిలీగా ధ్రువీకరిస్తే బీమా నమోదుకు అవకాశం ఉంది.

కుటుంబానికి ఆధారమైన వారికే బీమా సదుపాయం

కుటుంబానికి ఆధారమైన, సంపాదించే వ్యక్తి పేరుతో బీమా ఉండాలి. సంపాదించే వ్యక్తి ప్రమాదవశాత్తు, సాధారణంగా మరణించినపుడు బీమా సదుపాయం లభిస్తుంది. గతంలో ఇందుకు విరుద్ధంగా బీమా చేయించుకోవడం వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయి. అనేక కుటుంబాల్లో మహిళల పేరుతో బీమా చేశారు. భర్తలను నామినీలుగా చేర్చారు. నామినీ ఉన్న భర్త మరణించినపుడు వైఎస్‌ఆర్ బీమా కోసం మహిళలు డీఆర్‌డీఏ–వైకేపీ కార్యాలయానికి వస్తున్నారు. బీమా ఎవరి పేరుతో ఉంటే వారు మరణించినపుడే నామినీకి పరిహారం లభిస్తుంది. మహిళల పేరుతో బీమా చేయించడం, భర్తలను నామినీలుగా పెట్టడం వల్ల అనేక కుటుంబాలు పరిహారం పొందలేకపోతున్నాయి. 2023–24 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన సర్వేలో మార్పులు,చేర్పులు చేశారు. కుటుంబానికి ఎవరు ఆధారంగా ఉంటారో వారి పేరుతో బీమాను మార్పు చేసుకోవాలి.

ఆర్థిక భరోసా లభించింది



మాది బనగానపల్లె. మా తల్లి మట్టా నాగలక్ష్మీ మూడు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందింది. అమ్మ మరణం మా కుటుంబాన్ని కలచివేసింది. అయోమయానికి గురయ్యాం. సహజ మరణం కింద ప్రభుత్వం వైఎస్సార్ బీమా రూ.లక్ష అందజేసింది. ఈ మొత్తం మా కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించింది.

– లక్ష్మీదేవి

కొండంత అండ దొరికింది



మాది సి.బెళగల్. ఏడాది క్రితం నా భర్త దస్తగిరి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇద్దరు పిల్లలతోపాటు నాకు దిక్కులేని పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్ బీమాలో పేరు నమోదు కావడంతో నా భర్త చనిపోయిన రోజు మట్టి ఖర్చులకు సచివాలయ సిబ్బంది రూ.10 వేలు అందజేశారు. ఆరు నెలల్లోపు నా బ్యాంకు అకౌంట్‌లో బీమా సొమ్ము రూ.5 లక్షలు జమ అయ్యింది. వైఎస్సార్ బీమా రూపంలో మాకు కొండంత అండ దొరికింది.

– పుణ్యవతి

పకడ్బందీగా నమోదు ప్రక్రియ



వైఎస్‌ఆర్ బీమా నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాం. రెన్యువల్ చేయడం, కొత్త కుటుంబాలను నమోదు చేయడంలో కర్నూలు జిల్లాకు రాష్ట్రంలోనే రెండో స్థానం లభించింది. అందరూ సమష్టిగా కృషి చేయడం వల్ల ఇది సాధ్యమైంది. 2022–23తో పోలిస్తే 2023–24లో ఎక్కువ కుటుంబాలు బీమా పథకం కింద నమోదయ్యాయి. ఇప్పటి వరకు 5,69,866 కుటుంబాలకు వైఎస్సార్ బీమా సదుపాయం కల్పించాం. ఈ ఏడాది కొత్తగా 2,8917 కుటుంబాలు ఈ పథకంలో చేరాయి. వైఎస్‌ఆర్ బీమా క్లైమ్‌ల పరిష్కారం కూడా వేగవంతం చేశాం.

– వెంకటసుబ్బయ్య, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ–వైకేపీ

మోడల్ హార్టికల్చర్ హబ్‌గా బనవాసి నర్సరీ

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన



బనవాసి నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, చిత్రంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తదితరులు

ఎమ్మిగనూరురూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో బనవాసిలో ఏర్పాటు చేసిన నర్సరీని మోడల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన తెలిపారు. బుధవారం బనవాసి నర్సరీని, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెటర్నరీ కాలేజీని, బనవాసి ఘనీకృతవీర్య ఆబోతు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన నర్సరీల్లో బనవాసి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందన్నారు. దాదాపు 10 ఎకరాల్లో పండ్ల మొక్కలతో పాటు ఇతర మొక్కలను కూడా పెంచుతున్నారని తెలిపారు. ఎర్ర నేల, నీటి వసతిలో పాటు అన్ని సౌకర్యాలు బాగున్నాయని, నాలుగేళ్ల తర్వాత నర్సరీలో ఎక్కడా ఖాళీ స్థలం కనిపించకపోవచ్చునన్నారు. రాష్ట్రంలో బనవాసి ఘనీకృత వీర్య ఆబోతు కేంద్రానికి మంచి గుర్తింపు ఉందన్నారు. కేంద్రంలో సౌకర్యాలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. శ్రీ వెంకటేశ్వ విశ్వవిద్యాలం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెటర్నరీ కాలేజీ తరగతి గదులు, ల్యాబ్‌తో పాటు గొర్రెల పెంపకం కోసం ఏర్పాటు చేసిన షెడ్లను ఆమె పరిశీలించారు. బస్‌స్టాప్‌తో పాటు కాలేజీ చుట్టూ కాంపౌడ్ ఏర్పాటు చేయాలని విద్యార్థినులు కోరగా త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధ కశాఖ అధికారి రామచంద్రయ్య, మండల ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో బంగారమ్మ, ఫారెస్ట్ అధికారులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు.. బాగా చదివించండి

- ఉపాధి కూలీలతో జిల్లా కలెక్టర్ మాటామంతీ



కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

గోనెగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం 'నాడు–నేడు' కింద ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలను మార్చిందని, పిల్లలను పాఠశాలలకు పంపించి వారిని బాగా చదివించాలని ఉపాధి కూలీలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన సూచించారు. బాల్య వివాహాలు చేయకుండా వారికి మంచి చదువు చెప్పించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద గోనెగండ్ల సమీపంలోని కాలువలో జరుగుతున్న పూడికతీత పనులను ఆమె పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. పనులకు ఎన్ని గంటలకు హాజరు అవుతున్నారు.. ఎప్పుడు వెళ్తున్నారు..వేతనం ఎంత వస్తోందని అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కిట్లను పరిశీలించి, కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల మంజూరుపై ఆరా తీశారు. ఉపాధి హామీ పథకం కింద పొలాల్లో నీటి గుంతల ఏర్పాటుకు బిల్లులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను రైతులు కోరారు. డ్వామా పీడీ అమర్నాథరెడ్డి, ఏపీడీ అల్లీపీరా, తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

59 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు



జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని 59 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, సొంతూరులోనే ఈ సేవలు పొందవచ్చని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. బుధవారం ఆమె తన కార్యాంయలో విలేకరులతో మాట్లాడారు. మొదటి దశలో రీసర్వే పూర్తయిన 68 గ్రామాల పరిధిలోని 59 సచివాలయాల్లో జూన్ 1 నుంచి రిజిస్ట్రేషన్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇందులో ఇప్పటికే 40 సచివాలయాల పరిధిలో 124 రిజిస్ట్రేషన్‌లు చేపట్టామన్నారు. రిజిస్ట్రేషన్ సేవల్లో భాగంగా విక్రయం, దాన విక్రయం, వీలునామా, మార్టిగేజ్ విభాగాల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌తో పాటు మ్యూటేషన్, సబ్ డివిజన్, ఎల్‌పీ నంబర్, ల్యాండ్ కన్వర్షన్ సేవలు కూడా పొందవచ్చన్నారు. గతంలో ఆయా సేవల కోసం ప్రజలు సమీపంలోని మండలాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రభుత్వం ఇప్పుడు స్థానిక సచివాలయంలోనే ఈ సేవలను అందిస్తోందన్నారు.

రెండో దశ 25 గ్రామాల్లో రీసర్వే

జిల్లాలో మొదటి దశ 68 గ్రామాల్లో రీసర్వే పూర్తి అయిందని, ఇప్పటికే 90 శాతానికిపైగా భూ హక్కు పత్రాలను పంపిణీ చేసినట్లు జేసీ తెలిపారు. రెండో దశలో మరో 25 గ్రామాల్లో రీసర్వే కొనసాగుతుందన్నారు. ఇందులో ఆరు గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తి కాగా, మిగిలిన 19 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు కొనసాగుతున్నట్లు చెప్పారు. కాగా, రీసర్వేలో ప్రజల అభ్యర్థల స్వీకరణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని.. ఎవరైనా అన్యాయం జరిగిందని భావిస్తే తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు.

అన్ని పోలీస్‌స్టేషన్లలో ఈ–బీట్ సిస్టమ్

- ఎస్పీ కృష్ణకాంత్





వర్క్‌షాప్‌కు హాజరైన పోలీసులు, మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ నెల(జూన్) 24వ తేదీ లోపల ఈ–బీట్ సిస్టమ్ అమలులో ఉండాలన్నారు ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో 92 మంది సీసీటీఎన్‌ఎస్ పోలీసులకు ఈ–బీట్ సిస్టమ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌లో గస్తీకి వెళ్లే పోలీసుల మొబైళ్లలో సీఎఫ్‌ఎంఎస్ ఐడీతో ఈ–బీట్ సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేయించాలన్నారు. ఆయా సబ్ డివిజన్ల పరిధిలో బీట్ పాయింట్స్, రౌడీషీటర్లు, చెడు ప్రవర్తన గల వారి ఇళ్లు, ప్రదేశాలను గుర్తించి ఈ–బీట్స్ పక్కాగా అమలు జరిగేలా చూడాలన్నారు. జిల్లా కేంద్రం నుంచి ఈ–బీట్ సిస్టమ్ మానిటరింగ్ చేస్తుంటారని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు అబ్దుల్ గౌస్, గుణశేఖర్ బాబు, రామయ్య నాయుడు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొత్తగా 11 చెరువులు



రూపుదిద్దుకున్న కొత్త చెరువు

- పూర్తయిన నిర్మాణాలు
- అమృత సరోవర్లుగా అభివృద్ధి
- పెరగనున్న భూగర్భ జలాలు

కర్నూలు(అగ్రికల్చర్): వాటర్‌షెడ్ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా నీటియాజమాన్య సంస్థ కొత్తగా 11 చెరువులు నిర్మించింది. ఇందుకోసం దాదాపు రూ. కోటి వరకు ఖర్చు చేసింది. ఒక్కో చెరువు 10 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్లకుపైగా నీటి సామర్థ్యం కలిగి ఉంది. కొన్ని చోట్ల ప్రభుత్వ భూముల్లో నిర్మాణం చేపట్టగా.. మరికొన్ని చోట్ల రైతులే భూములు ఇచ్చారు. కొత్త చెరువులకు ఆయా గ్రామాలకు చెందిన రైతుల సూచనల మేరకు పేర్లు కూడా పెట్టారు. చెరువుల నిర్మాణంతో బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. ఓర్వకల్లు మండలంలో శకునాలలో 2.91, కాల్వలో 1.88, కృష్ణగిరి మండలం పోతుగల్‌లో 3, ఎమ్మిగనూరు మండలం కందనాతిలో 4.1, హాలహర్వి మండలం బాపురంలో ఒకటి 6.23, మరొకటి 3.66, హాలహర్విలో 2.28 ఎకరాల ప్రకారం మొత్తం 7 కొత్త చెరువులను నిర్మించడం పూర్తయింది. నంద్యాల జిల్లా డోన్ మండలం ఉంగరానిగుంట్లలో రెండు, అనుంపల్లి, లక్షుంపల్లి గ్రామాల్లో ఒక్కొక్కటి ప్రకారం మొత్తం 4 పూర్తి చేశారు. నిర్మాణం పూర్తి చేసుకున్న వీటిని అమృత్ సరోవర్‌లుగా అభివృద్ధి చేస్తున్నారు. చెరువు నిండిన తర్వాత నీళ్లు బయటికి వెళ్లిపోయేందుకు మరువ కూడా ఏర్పాటు చేస్తున్నారు. చెరువులోకి నీరు వచ్చి చేరేందుకు అవసరమైన మార్గాలను రూపొందించారు. ఒక్కో చెరువు కింద దాదాపు 100 బావులు, బోర్లలో భూగర్భ జలాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. దీంతో ఆయకట్టు సాగు పెరుగనుంది. కొత్త చెరువులను జిల్లా కలెక్టర్ జి.సృజన, జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి పరిశీలించారు. చెరువు కట్టలపైన, పరిసరాల్లో మొక్కలు నాటి పచ్చదనం అభివృద్ధి చర్యలు తీసుకుంటున్నట్లు అడిషినల్ పీడీ సలీమ్‌బాషా తెలిపారు.



కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో యోగాసనాలు వేస్తున్న మహిళలు, బాలికలు

యోగా..మంచిదేగా!



ఉమ్మడి కర్నూలు జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం పండుగలా జరుపుకున్నారు. విద్యార్థులు, యువతీ, యువకులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సూర్య నమస్కారాలతోపాటు యోగాసనాలు వేసి అలరించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ఆయా కార్యక్రమాలకు హాజరై యోగా ప్రాశస్త్యాన్ని వివరించారు. యోగాసనాలు సాధన చేస్తే ఆరోగ్యానికి మంచిదని తెలిపారు.

– వివరాలు 8లో ▶

క్లుప్తంగా

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న డీటీడబ్ల్యూఓ శ్రీనివాసకుమార్

కర్నూలు(అర్బన్): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసకుమార్ అన్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 373వ ర్యాంకు సాధించిన తుగ్గలి మండలం కొత్తపల్లి గుడిసెలు గ్రామానికి చెందిన దేవరకొండ అనిల్‌కుమార్‌ను ఆయన ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.చంద్రప్ప ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ ఎలాంటి ప్రత్యేక కోచింగ్ తీసుకోకుండానే, కేవలం కళాశాలలో ఇచ్చిన కోచింగ్‌తో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు రామాంజనేయులు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో 2023 మార్చిలో జరిగిన డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎ.ఆనందరావు విడుదల చేశారు. డిగ్రీ మొదటి సంవత్సరం రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలకు 6,682 మంది విద్యార్థులు హాజరుకాగా 3,387 మంది, మూడో సెమిస్టర్ పరీక్షలకు 10,722 మంది హాజరు కాగా 4,630 మంది, ఐదో సెమిస్టర్ పరీక్షలకు 12,245 మంది విద్యార్థులు హాజరుకాగా 9,516 మంది పాసయ్యారు. అలాగే డిగ్రీ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు 1,2740 మంది విద్యార్థులకుగాను 5529 మంది, మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 10,160 మందికిగాను 4,721 మంది, ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 5,900 మందికిగాను 2,837 మంది ఉత్తీర్ణులయ్యారు. వర్సిటీ పరిధిలో 2023 జూన్17వ తేదీన జరిగిన డిగ్రీ 2016 బ్యాచ్ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ పరీక్షలకు 593 మంది విద్యార్థులు హాజరుకాగా 570 మంది పాసయ్యారని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎ.ఆనందరావు తెలిపారు. పరీక్ష పేపర్లను రీవాల్యూయేషన్ కోసం ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద ఈ నెల 30వ తేదీలోగా తగిన రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.



నమో..సూర్యదేవాయ: కర్నూలులో యోగా వేడుకల్లో పాల్గొన్న ఎంపీ సంజీవ్‌కుమార్



ప్రశాంత చిత్తం: కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో..



శ్వాస నిశ్చలం: ఆసనాలు వేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు



కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో..



ఏకాగ్రత: పాణ్యం సమీపంలోని ఫార్మసీ కాలేజీలో..



ప్రాణాయామం: ఎమ్మిగనూరు డిగ్రీ కళాశాలలో..

యోగానందం

శరీరాన్ని విల్లులా వంచారు.. శ్వాసను క్రమబద్ధీకరించుకున్నారు..యోగాసనాలు వేసి మానసిక ప్రశాంతతను పొందారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. విద్యా సంస్థలు, కార్యాలయాలు, క్రీడా మైదానాల్లో యోగాసనాలు సాధన చేశారు. నిత్యం యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని గురువులు బోధించారు.

– సాక్షినెట్‌వర్క్/ సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



శివ పార్వతుల వేషధారణలో యోగా

అబ్బురపరిచిన యోగా విన్యాసం



ధ్యాన ముద్ర: నందికొట్కూరులోని కోటా ప్రభుత్వహైస్కూల్‌లో..



యోగాభివందనం: డోన్‌లోని కోర్టు ఆవరణలో ఆసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

యోగాతో ఆరోగ్యం పదిలం

- కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కర్నూలు(రూరల్): ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవకుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలో ఔట్‌డోర్ స్టేడియంలో వేడుకలు నిర్వహించారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కర్నూలు ఎంపీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వేడుకలకు హాజరైన వారితో గురువులు యోగాసనాలు వేయించారు. అనంతరం ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ యోగాను నిరంతర అభ్యాసంగా మార్చుకోవాలన్నారు. యోగా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. నగర మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలన్నారు. యోగా సాధనతో మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఆత్మస్థైర్యంతో రోగాలను జయించవచ్చన్నారు. అనంతరం యోగా సంఘం సభ్యులను, మంచి ప్రతిభ కనపరచిన చిన్నారులను అభినందించి బహుమతులు అందజేశారు. రాష్ట్రస్థాయిలో బెస్ట్ ఇన్‌ఫ్లూయెన్స్ స్టూడెంట్ అవార్డును సొంతం చేసుకున్న టి.ఎస్.అక్షరను ఎంపీ అభినందించారు. కార్యక్రమంలో జాతీయ యోగా సంఘం సభ్యులు శ్రీధర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య, క్రీడాశాఖ సీఈఓ రమణ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, జిల్లా ఆయుష్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌సీసీ కమాండర్ కల్నల్ రమేష్, అక్షయ మధుర్, రెండో పటాలం డీఎస్పీ మహబూబ్ బాషా, ఆయుర్వేద మెడికల్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, యునాని వైద్యాధికారి శ్రీనివాస్, న్యాచురోపతి కె.వి.కె.ప్రసాద్, యోగా గురువు జయలక్ష్మి, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు, యోగా అభ్యాసకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ కార్యాలయంలో యోగా చేస్తున్న న్యాయమూర్తులు



అమృత్ సరోవర్ దగ్గర యోగా చేస్తున్న దృశ్యం

జిల్లా కోర్టు ఆవరణలో..

కర్నూలు (లీగల్): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగాజిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు నేతృత్వంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట నాగ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగభూషణం నాయుడు, చక్రపాణి, న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది, యోగా మాస్టర్, న్యాయ శాఖ ఉద్యోగి ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

15 అమృత్ సరోవర్ చెరువుల్లో యోగా

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో అమృత్ సరోవర్‌లుగా అభివృద్ధి చేసిన చెరువుల్లో ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదోని, ఆలూరు, ఆస్పరి, దేవనకొండ, హలహర్వి, హొళగుంద, కల్లూరు, క్రిష్ణగిరి, కర్నూలు, నందవరం, ఓర్వకల్లు, పత్తికొండ, వెల్దుర్తి, ఎమ్మిగనూరు మండలాల్లోని 15 చెరువుల్లో బుధవారం ఉదయమే యోగా కార్యాక్రమాలు చేపట్టారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటైంది. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉపాధి కూలీలు యోగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



కూలీలతో యోగా చేయిస్తున్న డ్వామా పీడీ

మానసిక ప్రశాంతత

నంద్యాల టౌన్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బొమ్మలసత్రం వద్ద ఉన్న జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బందికి యోగా ఆసనాలు వేయించి వాటి వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రపంచానికి భారతదేశం అందించిన అద్భుతాల్లో యోగా ఒకటి అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎ.వెంకట రాముడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు , ఏఆర్ డీఎస్పీ రంగముని, ఆర్ఎస్ఐ అల్లా ఉద్దీన్, ఆర్ఐ సుధాకర్ పాల్గొన్నారు.



యోగా ఆవశ్యకతను సిబ్బందికి వివరిస్తున్న నంద్యాల ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి

సంపూర్ణ ఆరోగ్యం

ఉయ్యాలవాడ: ప్రతి రోజు యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి అన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని కొండుపల్లె గ్రామ సమీపంలోని ఊరకుంట వద్ద కూలీలతో యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం శారీరక శ్రమ లేకపోవడంతో చాలా మంది రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. అనంతరం ఏపీడీ సాంబశివరావు, ఏపీఓ రవిప్రకాష్, సర్పంచ్ ఇరిగెల లక్ష్మిపద్మజతో కలిసి మొక్కలు నాటారు.

మెరిట్ అభ్యర్థులే హాజరుకావాలి

కర్నూలు సిటీ: కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో టీచింగ్ ఫ్యాకల్టీ నియామకం కోసం నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు తుది మెరిట్ జాబితాలో పేర్లు ఉండి, సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చిన వారు మాత్రమే హాజరుకావాలని జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య సూచించారు. బుధవారం చేపట్టిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో జేసీ పాల్గొన్నారు. అభ్యర్థుల విద్యార్హత ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్‌లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 25 రకాల పోస్టులకు సబంధించి 203 ఖాళీలను భర్తీ చేస్తున్నామని చెప్పారు. ఈ పోస్టులకు ఒక్కోదానికి ముగ్గురు చొప్పున మెరిట్ ప్రాతిపదికన మొత్తం 634 మందితో తుడి మెరిట్ జాబితాను తయారు చేశామన్నారు. ఆన్‌లైన్‌లో ఈ జాబితాను అందుబాటులో ఉంచారని, ఇందులో పేర్లు ఉండి, సెల్‌ఫోన్లకు మెసేజ్ వచ్చిన వారు మాత్రమే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు. తుది మెరిట్ జాబితాపై అభ్యర్థులకు అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో కలెక్టర్, జేసీలకు ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. మెరిట్ లిస్టులో పేరు ఉండి, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కాని వారికి రేపు(శుక్రవారం) అవకాశం ఇచ్చామని సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డా.కె వేణుగోపాల్ తెలిపారు. ఎవరైనా నకిలి సర్టిఫికెట్లు సమర్పించినట్లు తెలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్లు షురూ

- నోటిఫికేషన్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి
- 24 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- జూలై 3న సీట్ల కేటాయింపు
- 4న తరగతులు ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో సుమారు 10వేల డిగ్రీ సీట్లు



ప్రభుత్వ డిగ్రీ కళాశాల

నంద్యాల(న్యూటౌన్): డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియ సాగుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 10వేల సీట్లు ఉన్నాయి. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు తొలుత ఇంజినీరింగ్, మెడిసిన్ సంబంధ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రాధాన్యత ఇస్తారు. ఇందుకు సంబంధించిన ఎంట్రెన్స్ పరీక్షల ఫలితాలు కూడా ఇటీవలే విడుదల కావడంతో డిగ్రీ ప్రవేశాలకు పలువురు ఎదురుచూస్తున్నారు. తాజా గా ఏపీ ఉన్నత విద్యామండలి డిగ్రీ ప్రవేశాలకు అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్లు..

జిల్లాలోని వివిధ కళాశాలల్లో డిగ్రీలో చేరేందుకు ఈనెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వెబ్ ఆప్షన్ల ద్వారా జిల్లాతో పాటు మిగతా ప్రాంతాల్లోని కాలేజీలను సైతం ఎంపిక చేసుకోవచ్చు. గ్రూప్, కాలేజీ తదితరవన్నీ ఆన్‌లైన్‌లోనే చేసుకోవాలి. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు స్పెషల్ కేటగిరి వెరిఫికేషన్ జరుగుతుంది. అలాగే ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ సాగుతుంది. వెబ్ ఆప్షన్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు జూలై 3వ తేదీన ఉన్నత విద్యా మండలి సీట్లను కేటాయిస్తుంది. జూలై 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో 101 కళాశాలలు

రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో సుమారు 101 కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీబీఎం, ఐటీ తదితర కోర్సుల్లో సుమారు 10వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. బీఏ, బీకాం, బీఎస్సీలో పలు కాంబినేషన్ కోర్సులున్నాయి. ఆర్‌యూ పరిధిలోని కాలేజీలు వాటిని ఎక్కువగా ఆఫర్ చేస్తున్నాయి. దీంతో పాటు కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, బయో టెక్నాలజీ రంగాలకు సంబంధించి ప్రస్తుతం డిమాండ్ ఉన్న వివిధ రకాల కోర్సులు ఉన్నాయి.

ఓటు.. భవితకు చోటు!

- సరిచూసుకోండి.. నమోదు చేసుకోండి
- జూలై 21 నుంచి ఆగస్టు 21వరకు ఓటరు జాబితా పరిశీలన



కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికలు 2024 ఏప్రిల్, మే నెలల్లో రానుండడంతో భారత ఎన్నికల సంఘం సమాయత్తం అవుతోంది. రెండు నెలలు ముందుగానే ఈ ఏడాది ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం–2024కు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, పాత ఓటరు జాబితాలోని తప్పొప్పులను సరిదిద్దుకోవడానికి అవకాశం కల్పించింది. ఇందుకోసం జూలై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ బీఎల్‌ఓలు ఇంటింటా తిరగనున్నారు.

మార్పులు, చేర్పులకు అవకాశం

2023 ఓటరు సవరణ జాబితా ప్రకారం జిల్లాలో 9,65,685 మంది పురుష, 9,74,649 మంది మహిళా ఓటర్ల ఉన్నారు. పురుష ఓటర్ల సంఖ్యతో పోల్చుకుంటే మహిళల ఓటర్ల సంఖ్య 8,964 ఎక్కువగా ఉంది. ఓటరు జాబితాలోని పేర్లపై ఎవరికైనా అనుమానం ఉంటే ఫిర్యాదు చేస్తే బూత్ స్థాయిలో అధికారులు విచారణ చేపడుతారు. అయితే సరైన ఆధారాలు చూపితేనే తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారు. అలాగే ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. నియోజకవర్గం మార్పు, పేర్లు, అడ్రస్సులు, ఫోన్ నంబర్లు, ఫొటో గుర్తింపు కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. చనిపోయిన వారిని జాబితా నుంచి తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు.

ఓటరు జాబితాపై ఇంటింటా విచారణ

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ–2024 కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు జూలై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఇంటింటా తిరుగుతారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఉంటే వారిని ఓటర్లుగా నమోదు చేస్తారు. అలాగే చనిపోయిన వారిని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లను గుర్తిస్తారు. చనిపోయన వారిని జాబితా నుంచి తొలగిస్తారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు ఉంటే వారికి ఎక్కడ ఓటు ఉండాలో వారి అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటారు. తప్పొప్పులు ఉన్నా పరిశీలన చేస్తారు.

అక్టోబర్ 17న ముసాయిదా జాబితా ప్రకటన

ప్రత్యేక ఓటరు నమోదు సవరణ 2024లో భాగంగా అక్టోబర్ 17వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఆ జాబితాపై అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. డిసెంబర్ 26న నాటికీ అభ్యంతరాల పరిశీలనను పూర్తి చేసి 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు. కాగా, అక్టోబర్ 28, 29, నవంబర్ 18,19 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహించి ఓటర్ల నుంచి అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, మార్పులు, చేర్పులపై ప్రత్యేక కార్యక్రమాలను స్వీకరిస్తారు. ఆయా రోజుల్లో జిల్లాలోని 2,184 పోలింగ్ బూతుల్లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు.

త్రైమాసికానికి ఒక సారి కొత్త ఓటర్ల నమోదు

భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించింది. అయితే గతంలో ప్రతి ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండితే ఓటరు జాబితా చేర్చేవారు. అయితే ఈసారి భారత ఎన్నికల సంఘం ఈ విధానంలో మార్పు చేసింది. 18 ఏళ్లు ఎప్పుడు నిండితే అప్పుడే ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఏర్పాట్లు చేసింది. సంవత్సరానికి 4 నాలుగు సార్లు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. ప్రతి త్రైమాసికానికి ఒకసారి అవకాశం కల్పించింది. జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ త్రైమాసికాలకు 18 ఏళ్లు నిండితే యువతీ, యువకులు ఓటరుగా నమోదు కావచ్చు.

దరఖాస్తులను ఎక్కడ ఇవ్వాలి?

ప్రతి పోలింగ్ బూతులో అధికారులు నిర్దేశించిన తేదీల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తారు. అంతేగాక స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లోనూ దరఖాస్తులను సమర్పించవచ్చు. బూత్ లెవల్ ఆఫీసర్లకు సమర్పించిన సరిపోతుంది. లేదంటే ఆన్‌లైన్‌లో కూడా స్వయంగా దరఖాస్తులను సమర్పించవచ్చు. WWW.NVSP.IN లేదా ఓటరు హెల్ప్‌లైన్ అనే మొబైల్ యాప్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

యువతీ, యువకులకు భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కు ఓటు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి. ఎన్నికల్లో యువతీ, యువకులు పాల్గొని ఉత్తమ పాలకులను ఎన్నుకోవాలి. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ–2024 కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి ఓటరు జాబితాపై పరిశీలన చేస్తారు. జాబితాలో పేర్ల మార్పు, అడ్రస్ మార్పు చేసుకోవచ్చు. –డాక్టర్ జి.సృజన, కలెక్టర్